"రాచపీనుగు తోడులేకుండా వెళ్లదు"

బ్రాహ్మడు "భవతి భిక్షాం దేహీ" అంటూ చెంబు పుచ్చుకుని బయలుదేరా డంటే యెటు చూసినా గౌరవమూ, యెటు చూసినా పూజలూనూ.

స్త్రీలందరూ అతనికి భక్తిప్రపత్తులు నివేదిస్తారు.

తలో పిడికెడూ బియ్యం వేసి "మహాత్మా! పాపులం, వుద్ధరించు" అంటూ శిరస్సులు వంచుతారు.

అతని గొప్పతనం అంగీకరిస్తారు.

ఇక, క్షత్రియుడు "నుంచో" అంటూ కత్తి దూసివురిమాడంటే, కనుచూపుమేర, వెనకా, ముందూ, పక్కంగా హడల్.

స్త్రీపురుషులు ఆబాలగోపాలమూ అతనికి వినయవిధేయతలు కనపరుస్తారు.

"పన్ను" అని పేరుపెట్టి తమ కష్టార్జితంలో కొంతభాగం అతని పాదాల దగ్గిర దాఖలుచేసి "మహాప్రభూ! నీబిడ్డలం, రక్షించు" అంటూ పడిపడిదండాలు పెడతారు.

అతని ప్రభుత్వం అంగీకరిస్తారు.

కాగా, రాగిబుడ్డిచెంబుతో బయలుదేరిన బ్రాహ్మలలో చివరికి వడ్డీవ్యాపారంలోకి దిగినవా రున్నారు

ఒక్క కత్తితో మాత్రం బయలుదేరిన క్షత్రియులలో చివరికి మహామహా సామ్రాజ్యాలు స్థాపించుకున్నవా రున్నారు.

ఇంచేత, బ్రాహ్మణవృత్తీ క్షత్రియవృత్తీ—యీ రెండే లోకంలో పెట్టుబడి లేని వృత్తులు.

తక్కిన వృత్తులు ఎంతో కొంత మదుపుంచేనే సాగుతాయి.

అయితే, బ్రాహ్మడూ క్షత్రియుడూ కూడా పుచ్చుకునే వస్తువు రకంలో వొకటే అయినా, ఆయివ్వడంలోనూ, యీ పుచ్చుకోడంలోనూ మాత్రం భేదం వుంది.

ఆభేదం కాస్తా కూస్తా కాదు. దోమకీ యేనుక్కీ వున్నంత.

ఇందుకి నిదర్శనంగా, ఆవృత్తికి, మొగంమీద దైన్యం లాస్యం చేస్తూ వుంటుంది.

ఈవృత్తికి, మొగంమీద శౌర్యం తాండవం చేస్తూవుంటుంది.

కాని దీన్నిబట్టి వీటిలో దేన్నీ కూడా దూషించడానికీ వల్ల కాదు, భూషించడానికీ వల్లకాదు.

ఎంచేతనంటే ?

సూక్ష్మవిచారణ సాగిస్తే వొకమాటు బ్రాహ్మణవృత్తి గొప్ప దనిపిస్తుంది. మరోమాటు క్షత్రియవృత్తి గొప్ప దనిపిస్తుంది.

ఇంతేకాక: పుట్టింది మొదలు గిట్టేదాకా, పిపీలికాది బ్రహ్మ పర్యంతమూ, ప్రతీ ప్రాణి జీవితంలోనూ యీ రెండూ పెన వేసుకునే కనపడతాయి.

ఇవి లేందీ జీవితమే లేదు.

ఈరెండూ అనాదినుంచీ వున్నాయి. సృష్టి వున్నంతకాలమూ వుంటాయి.

ఇలాగ డబ్బు సంపాదించడంలో దానికి కిందిమెట్టూ, దీనికి పైమెట్టూ మరిలేవు.

అయితే, బ్రాహ్మణవృత్తికి వున్నవూరు విడిచిపెట్ట నక్కర లేదు.

క్షత్రియవృత్తికి వూరే కాదు, వొక్కొక్కప్పుడు దేశమే కాదు, చివరికి ప్రాణాలు కూడా విడిచిపెట్టవలసి వస్తుంది.

౨

ఒకమాటు అలాగే తటస్థించింది.

పుట్టిపెరిగినచోట లుగసాను రాగా, ఎంత కష్టపడినా దానికి విరుగుడున్నూ దొరక్కపోగా, డబ్బూ పదవులూ వీలయితే రాజ్యాలూ సంపాదించుకుందా మని కూడబలుక్కొని, గోత్రాని కొక కుటుంబం చొప్పున అయిదు గోత్రాలకు చెందిన క్షత్రియ వీరులు దేశం విడిచి బయలుదేరారు.

దారి పొడూగునా తమవంటివారే కొందరు, కొంతకొంత ప్రదేశం ఆక్రమించుకుని ప్రభువులై క్షాత్రం నెరుపుకుంటూ వుండగా వారింకా ముందుకి సాగారు.

రాగా రాగా చివరి కొక తురకరాజ్యం తగిలింది.

అది చాలా విశాల మయింది.

భాగ్యభోగ్యాలతో తులతూగుతూ వుంది.

నవాబు చేతికింద అనేకమంది యోధాగ్రేసరు లున్నారనీ, రాజ్యవైశాల్యాన్ని పట్టి చూస్తే వారి సంఖ్య చాలా చిన్న దనీ, వీరు డైనవాడు వస్తే పోనివ్వక, అతను, జాగీరిచ్చి నిలు పుతా డనీ వారికి తెలిసింది.

అక్కడ, తమకి తగిన పదవులు సంపాదించుకోడం అసాధ్యం కాదనిన్నీ వారికి నమ్మకం కలిగింది.

మకాం వేశారు.

నవాబు విహారంతా వాకబు చేశారు.

వీరగంధాలు పూసుకుని ఒకనాడు అయిదుగురూ దర్శనానికి బయలుదేరారు.

అసలే క్షత్రియులు

ఆపైని ఆకొన్న సింహాలు.

ఇక తేజస్సుకి లోటేమిటీ ?

అయితే, అలాంటి శౌర్యరాసులు బజారులో కాలినడకను నడుస్తూ వుండడం చూసి, పౌరులు చాలా నొచ్చుకున్నారు.

ఇంతలో దేవిడీ దగ్గిరపడింది.

మొదటి ద్వారంలో వారిని చూసినవాళ్లు లేకపోయినారు.

రెండో ద్వారంలో పలకరించినవాళ్లు కనపడకపోయినారు.

మూడో ద్వారంలో వున్నవాళ్లు "ఎక్కడికి?" అందామనుకుని వుగ్గబట్టుకుని ప్రాగీపలాడారు; కాని ధైర్యం నిలవకపోయింది.

నాలుగు, అయిదు, ఆరు—యీ ద్వారాల్లో వున్నవాళ్లు ప్రశ్నించారు; గాని వారు చెప్పింది గ్రహించలేకపోవడమే కాదు, తాము అడిగింది కూడా మరిచిపోయి తెల్లపోయి నుంచున్నారు.

పోగా, యిక యేడో ద్వారంలో వున్నవాళ్లు అసాధ్యులు. అది దాటితే యిక దర్బారేకనక అక్కడ వున్నవాళ్లు పిడుగులు.

ఈసంగతి గుర్తించి, క్షత్రియులు, వాళ్ళేమీ అడక్కముందే తమకి తామే నిలిచిపోయి "నవాబుగారి దర్శనం కావాలి" అన్నారు.

నిజానికి, కావా లనడం ప్రార్థించడమే.

కాని, ఆ అడగడంలో ధ్వనించిన బింకమూ, ఆ నుంచో డంలో రూపొందిన గాంభీర్యమూ, ఆమొగాలమీద పొటమ రించివున్న వీర తేజస్సూ, ఆమీసాల్లో నిలవతొక్కుకునివున్న శౌర్యస్ఫురణా, ఆచూపుల్లో దూసుకుపోతూవున్న కరుకు తనమూ, ఆచేతుల్లో వుర్రూతలూగుతూవున్న చంద్రహాసాలూ, ఆనడికట్లలో తొంగిచూస్తూవున్న కటారులూ, ఆ పరిసరా లన్నీ గుబాళింపచేస్తూవున్న వీరగంధాలూ చూశాటప్పటికి, వాళ్ళకి, ఆ కావాలన్నమాట హుజూరు హుకుం కంటేనూ యెక్కువది అన్నట్టు తోచింది.

వెంటనే వాళ్ళలో వొకడు లోపలికి వెళ్ళి, సెలవు పొంది వచ్చి, వారిని తీసుకుపోయి నవాబు యెదట హాజరుపెట్టాడు.

3

దర్బా రంతా నిండి పోయివుంది.

కిటకిటలాడిపోతోంది.

వజీర్లూ, కిల్లేదార్లూ, ఫౌజుదార్లూ, సరదార్లూ, జాగీరు దార్లూ, సౌదాగర్లూ—అంతా యిలాంటి ప్రజ్ఞావంతులే కాని అక్కడ కేవలం మనుష్యు లెవరూ లేరు.

రాచవారిని చూసి వారూ విభ్రాంతు లయినారు.

దర్బా రంతా యేదో వొక కొత్త తేజస్సు నిండినట్టు కన బడగా నవాబున్నూ చకితు డైనాడు.

ఒక్క క్షణం గాంభీర్యం విరాజమానం అయింది.

తరవాత నవాబు ఇంగితం కనిపెట్టి, వొకవజీరు అడగ్గా, క్షత్రియుల మొనగాడు అందుకున్నాడు.

"మేము చాలా దూరంనుంచి వస్తున్నాము"

"..............."

"ఉదారుడైన ప్రభువైనా, శూరుడైన ప్రతిస్పర్థి అయినా దొరక్కపోతాడా అని బయలుదేరాము"

"..............."

"మేము సూర్యవంశక్షత్రియులం"

"..............."

"మాది యోధజాతి"

"..............."

"కత్తిపట్టి, దుష్టశిక్షణా శిష్టరక్షణా చెయ్యడానికే మాజాతి యేర్పడింది"

"..............."

"యుద్ధం చెయ్యడం మాకు విలాసక్రీడ"

వినివిని వజీరుకేసి తిరిగి "యింకా అనేకులకూ అంతే" అన్నాడు నవాబు.

రాచవారికేసి చూస్తూ వజీరు ఆమాటకు శుకానువాదం చేశాడు.

దానిమీద "కావచ్చు; కాని ప్రాణాలు పూర్తిగా పోయాకే క్షత్రియుడి చేతిలో వుండిన కత్తి కిందపడిపోతుంది" అన్నాడు మొనగాడు.

"ఇంకా చాలామందికిన్నీ" అంటూ నవాబు వజీరుకేసి చూశాడు. వజీరు రాచవారిని చూస్తూ ఆమాట కూడా అనువదించాడు.

పురపుర చూస్తూ "అలాగేం ?" అనుకుని, మొనగాడు "రాచపీనుగు తోడు లేకుండా వెళ్లదు" అన్నాడు.

అంటే ?"

ఒకరికేసి వొకరు చూసుకుంటూ నవాబూ, వజీరూ వొక్క మాటే యీమాట అన్నారు.

"అంటేనా ? దెబ్బతినిన్నీ యెదటివాణ్ణి చంపిగాని క్షత్రియుడు చావడు"

"చాలా సాహస మైన మాట"

"చూపులకు అలాగే కనపడుతుంది"

"కనపడ్డమే కాదు. అంతే"

"ఎన్నటికీ కాదు"

"కాకేం ? ఒక్కొక్కజాతిలో శూరులే చాలామంది పుట్టవచ్చు"

"..............."

"వారిలో చాలామంది అసహాయశూరులే కావచ్చు"

"..............."

"ఎదటివాణ్ణి కూల్చినా కూల్చకపోయినా, ఒక్కొక్క శూరుడు, తాను పోరాడుతూనే ప్రాణాలు విడవవచ్చు"

"..............."

"అంతే కాని, పోటు తినీ కూడా పొడిచికాని చచ్చిపోడనడం నమ్మరానిమాట"

"తమ కలా తోచడం మా అదృష్టమే. ఏమంటే ? అవునంటే కాదంటూ కూచోడానికి, ప్రత్యక్షవిషయం కాని, యిది, శాస్త్రీయవిషయం కాదు"

"అవును"

"కనక, తమరు పరీక్ష చేయించవచ్చు"

సభ్యులు వులిక్కిపడ్డారు.

నవాబు "ఎలాగా ?" అన్నట్టు వజీరుకేసి చూశాడు.

వజీరు ఆచూపులు మాటల్లో పెట్టాడు.

దానిమీద రాజుల మొనగాడు మళ్ళీ అందుకున్నాడు.

"మాలో వొకడు, కటారి పిడిమీద చెయ్యి వేసుకుని, తమ సమక్షంలో నుంచుంటాడు"

"..............."

"తమ సర్దార్లలో తమ యిష్టంవచ్చినవారిని తుపాకీ యిచ్చి మావాడి యెదట పదిగజాలలో నుంచో పెట్టండి"

"..............."

"సరదారుచేత తుపాకీ వేయించండి"

"..............."

"మావాడు ఆదెబ్బ సంతోషంతో అందుకుంటాడు"

"అదెలాగా తప్పదు"

"తప్పడం యెందుకూ ? తప్పితే యిక మాక్షత్రియుల విశిష్టత యేమి కనపడుతుందీ ?"

నవాబు నిరుత్తరుడు కాగా, వజీరు మిడుతూ మిడుతూ చూశాడు.

"చిత్తగించారూ ?" అంటూ మొనగాడు మళ్ళీ అందుకున్నాడు.

"వినోదం నిమిత్తం మళ్ళీ మనవిచేసుకుంటున్నాను, మావాడు మందు ఆగుండుదెబ్బ తింటాడు"

"త్రిని ?"

"తినీతినడంతోటే ముందు కురుకుతాడు"

"ఉరికి ?"

"ఒక్కవేటున తమ సరదారుని పొడిచేస్తాడు"

నవాబు హృదయం గుబగుబ లాడింది.

సరదార్లు మెరుపుకొట్టినట్టయిపోయారు.

"ముందు మీవాడూ, తరవాతే మావాడూ పడిపోతారు" అన్నాడు మొనగాడు.

సభనిండా సన్నంగానే గుసగుసలు రేగాయి.

వెంటనే "అంటే ?" అన్నాడు వజీరు.

"ఇంకాకా మనవిచేసుకున్నదే. రాచపీనుగు తోడులేకుండా వెళ్ళదు" అంటూ మొనగాడు మీసంమీద చెయ్యి వేసుకున్నాడు.

దర్బారంతా మొదట స్తబ్ధమయిపోయింది.

తరవాత అప్పుడే మేలుకున్నట్టయింది.

చివరకి "ఇదేదో చూడవలసిందే" అన్నట్టు కనుబొమ్మ లెగర వేసుకుంది.

ఇలాచూసి అలాచూసి సభ్యు లందరూ తనకేసి చూశాటప్పటికి, శౌర్యం పుష్పింగగా, నవాబు "రేపు జాముపొద్దువేళ పరీక్ష" అని చెప్పి, నాటికి, క్షత్రియులకు సెల విచ్చాడు.

వెంటనే వజీరు, ఆతిథ్యం నెరపడానికి, రాజులవెంట వొక సరదారుని పంపాడు.

౪

ఆరుగురు క్షత్రియులు రాగా దర్బారంతా విరగబడిపోయింది.

అందులోనూ పచ్చబట్టలు కట్టుకుని వున్న యువకుణ్ణి చూసి వుద్రిక్త మయిపోయింది.

ఉభయపక్షాలవారూ "సంమే" అంటే "సంమే" అనుకున్నారు.

మొనగాడి పెద్దకొడుకు, ముందు తండ్రికీ తరవాత వరాసగా తక్కిన తలుగురు క్షత్రియులకీ పాదాభివందనాలు చేసి, వారి దీవనలు శిరసావహించి, నవాబుకి మళ్ళీ సలాములు చేసి కటారిపిడి పట్టుకుని నిరిషసలంలో నుంచోగా, దట్టించిన తుపాకీ పుచ్చుకుని వచ్చి, అతని కభిముఖంగా పదిగజాలలో వొక తురకయోధుడు నుంచున్నాడు.

మేడమీది జనానావారి చూపులికి కిటికీవ్రాచలు కరిగి పోయాయి.

చూసిచూసి నవాబు కన్నుగీటాడు.

తుపాకీ "ఢా" మ్మంది.

ఆఅగావుకి మూతలుపడ్డ దర్బారుకళ్లు మళ్ళీ వినబడేటప్పటికి, దెబ్బతిన్న రాచకుమారుడు, కెవ్వన అరిచి, చర్రున కటారి దూసి, చెంగున ముందు కురికాడు.

కాని,

ఐదుగజాలే వెళ్ళి కుప్పగా కూలిపోయాడు.

అందుకే దర్బారంతా వ్రూగిపోయింది.

నవాబుకూడా "భేష్" అన్నాడు.

కాని మొనగాడేదేమీ గమనించలేదు.

రంగస్థలంలో కొక్కు వుడాం వేశాడు.

"నేను పతితుణ్ణి—తమరు—నన్ను—తాకవద్దు" అంటూ మెడలు వాల్చేసిన కొడుకుకేసి చూడకుండా, అతని చేతిలో వున్న కటారి మాత్రం వుళాక్కుని "మళ్ళీ యిప్పుడే వస్తాను" అని నవాబుకి విన్నవించి మెరుపయి పోయాడు.

※

అక్కడ, బసలో, చూసీచూడ్డంతోటే భర్త వాలకం అంతా గ్రహించేసి, పైట తొలగించుకుని, భార్య, గుండెలిచ్చి యెదట నుంచుంది.

వెంటనే రివ్వున కటారి యెత్తి "నిజం చెప్పు. నీ పెద్దకొడుక్కి తండ్రి యెవడూ ?" అంటూ వురిమాడు మొనగాడు.

అది చూసి ఆమె మందహాసం చేసింది.

అబ్బురమా ?

రాచకుమార్ళకి వుగ్గుపాలతో యిలాంటి వురుములు నేర్పే ఆదిశక్తి ఆమె.

"ముందు పొడిచేసి తరవాతే అడిగినా చెబుతానుకాదూ ?" అంటూ ప్రారంభించిందామె.

"ఏం, పెద్దబ్బాయి రసాభాసం చేశాడా ?"

"..............."

"అనుకుంటూనే వున్నాను"

"..............."

"అయినా అనుగ్రహం వుంటే వివగాలు చెప్పండి"

మొనగాడికి నరాలన్నీ తోడేసినట్టయిపోయాయి.

"అనుకుంటూనే వుంది" ట.

ఆకళ్ళల్లో యేమి శౌర్యమూ ?

అలాంటి తల్లి చేతుల్లో పెరిగినందుకయినా ఆ రాచకుమారుడు తండ్రిమాట నిలిపి వుండవలసింది

మొనగాడికి కోపం పోలేదు. కాని, వుద్ధృతం అణిగింది.

మొలకట్టులో పెట్టలేదు, కాని, కటారి దింపేశాడు.

చివరికి జరిగిందంతా చెప్పి "యేం చెబుతా" వన్నాడు.

"ఎప్పుడు పుట్టిందో మాతల్లుల కోవ ?"

"..............."

"మాతల్లులూ, మాతల్లుల తల్లులూ, వారి తల్లులూ, యింకా వెనకటివారి తల్లులూ యెప్పుడూ, యెక్కడా, యెవరి చేతా వేలుపెట్టి చూపించుకోలేదు"

"..............."

"అయినా, తమకిప్పుడిలాంటి సందేహం కలగడంలో అసంగతం యేమీ లేదు"

"..............."

"చీల్చి చూసుకోండి, దీనివల్ల నాగుండెల్లో కూడా గాయం అయింది"

"..............."

"అయితే, ఇదిలా జరగడానికి పెద్దకారణమే వుంది"

"..............."

"నాదగ్గిర పాలు చాలక, పెద్దబ్బాయికి, కొన్నాళ్ళు వెంకటలక్ష్మి పాలుకూడా తగిలాయి"

ఇది విని మొనగాడు పెద్దనిట్టూర్పు విడిచాడు.

దీంతో అతనికి నెమరు తిరిగింది.

చెప్పడాని కేం వుందీ ? దాసీపాలు, రాచబిడ్డని, అయిదు గజాలు వెనక్కి లాగేశాయి.

"మొదట పరీక్ష చేసే తీసుకువెళ్ళి వుండవలసింది" అని మనస్సు అనగా " అలాంటివాడు పోవడమే మంచిది" అని బుద్ధి ఝమాయించి అనేసింది.

"దర్బారులో యేం జరిగిందీ ?"

"అబ్బాయి అలా పడ్డాడు, నే నిలా వచ్చాను. అప్పు డక్కడ లేకపోవడమే మంచిది ఉంటే యేం దుష్టమాట చెవిన పడి వుండునో ?"

"నిజమే; కాని యింకా యిలా నుంచుంటే యెలాగా ?"

"..............."

"చిన్నబ్బాయిని——"

ఇలా అంటూ తల్లి తన కేసి చూశాటప్పటికి "బాబయ్యా, నేను వస్తాను పదండి" అంటూ రెండో కొడుకు ముందుకు వచ్చాడు.

"వెళుతున్నాము. వీలయితే అబ్బాయి కీర్తి తీసుకువస్తాను. లేకపోతే——లేకపో——తే——" అంటూ మాట తేల్చేశాడు మొనగాడు.

"ఆ కటారి యిలా దయచేసి వెళ్ళండి" అంటూ భార్య, పైట సద్దుకుని చెయ్యి చాపింది.

కటారి యివ్వడంలోనూ, పుచ్చుకోడంలోనూ చెయ్యా చెయ్యా తగిలాయి.

దాంతో ఉభయవిద్యుత్తులూ కలిసినట్టు కాగా శౌర్యం ప్రదీప్తం అయింది.

శిరస్సుమీద చేతులుంచి దీవిస్తూ, ఆవృద్ధ క్షత్రశౌర్యం అంతా, ఆదంపతులు కొడుక్కి దఖలుపరిచేశారు.

౬

తన పెద్దకొడుకు అలా యెందు కయిపోయాడో ఆకారణం చెప్పి, చిన్నకొడుకుని చూపించి "యిప్పుడు మళ్ళీ తనిఖీ చేయించండి. ఇది చివరిది" అని విన్నవించాడు మొనగాడు.

అది విని దర్బా రంతా నిర్విణ్ణ మయిపోయింది.

"ఇలాంటి అసాధ్యప్రతిజ్ఞ నెరవేర్చుకోడానికి రత్నాలవంటి కొడుకుల్ని బలిపెట్టుకోడమా ?" అన్నాడు నవాబు.

"తమ ప్రీతికి చాలాచాలా నమస్కారాలు. అయితే, నా పెద్దకొడుకు అలా నడిదారిలో పడి వుండగా, తమరు నాకొడుకులు రత్నా లన్నంతమాత్రాన నా కేం తృప్తి ?" అని బదులడిగాడు. మొనగాడు.

"బాగా ఆలోచించుకోండి"

"ఒక్కటే ఆలోచన. ఒక్కటే నిశ్చయం"

"..............."

"మేము మానహానికి వోర్చుకోలేము"

"మరి తమ వంశం మాట ?"

"అప్రతిష్ఠాభాజనం అయిపోయాక యిక వంశంవుంటే యేమిటి, లేకపోతే యేమిటి ?"

ఈమాటమీద, తక్కిన నలుగురు క్షత్రియులూ వొక్కొక్కరే లేచి "బతికి వున్నంతకాలమూ మేము ఆదంపతులను పార్వతీపరమేశ్వరులుగా భావించి సేవించుకుంటాము" అని చెప్పారు.

ఇదివిని మొనగాడు సంతృప్తి కనపరిచాడు.

అతని కొడుకు పరమానందభరితుడైనాడు.

అప్పుడు నవాబు దర్బారంతా పరిశీలించాడు.

ఇలాంటి ప్రాణోత్క్రమణాలెన్నో చూసిన కళ్ళవి.

పైగా, శౌర్యప్రస్తావన వచ్చినప్పుడు, కొబ్బరిచెట్టుమీద నుంచి వుచ్చె పడడం యెలాంటిదో మనిషి మెడమీదినుంచి తలకాయ పడడమూ అలాంటిదే.

దీనికి సాయం, యిప్పుడు మతాంతరుల శౌర్యం పరీక్షించడం.

కాగా, అందరి మొగాలమీదా ఆత్రం తొణికిసలాడి పోయింది.

అది చూసి నవాబు మళ్ళీ సెలవిచ్చాడు.

వెంటనే తండ్రికీ, తక్కిన కులంవారికీ పాదాభివందనం చేసి, నవాబుకున్నూ సలాము చేసి వెళ్ళి, కటారిపిడిపట్టుకుని రాచ కుమారుడు యుద్ధస్థలంలో సింహప్పిల్లలాగ నుంచున్నాడు.

ఈ సందుబాట్లో తుపాకీ దట్టించుకుని వున్న తురకయోధు, నవాబుకి సలాములుచేసి, దర్జాగా వెళ్ళి, అతనియెదట పది గజాలలో నుంచున్నాడు.

వెంటనే దర్బారు నిస్తరంగసముద్రం అయిపోయింది.

సభ్యు లందరూ అనిమిషు లయిపోయారు.

మొనగాడు, చూపుతూపులతో పొడిచి కొడుకు శౌర్యం రెచ్చగొట్టి తప్పుకున్నాడు.

నవాబు మళ్ళీ కన్నుగీటాడు.

తుపాకీ మళ్ళీ "ఢా" మ్మంది.

"ఇతనయినా మాట తక్కిస్తాడో లేదో" అని మొనగాడు ఆందోళనపడుతూ వుండగా, "ఏమయింది?" అంటూ తురక ఒంగరూ ఆత్రంతో చూడబోయిన్నీ, చిరతలు కమ్మి కళ్లు స్వాధీనపడక అవస్థపడుతూ వుండగా "హరమహాదేవ" అంటూ వొక సింహనాదం వినిపించింది.

తురకయోధు, రాచకుమారుడు గుండుదెబ్బ తినడమూ, కటారి దుయ్యడమూ, తనమీదికి వురకడమూ—ఇవేమీ యెరగడు. కెవ్వున కేకమాత్రం వేశాడు.

నిదానించగా తురకయోధూ, రాచకుమారుడూ వొకరి పక్కని వొకరు పడి వున్నారు.

తురకయోధు పేగులు బయటికి వచ్చి వున్నాయి.

రాచకుమారుడి వక్షం తూట్లు తూట్లయిపోయి వుంది.

ఆ ప్రదేశం అంతా రక్తకొల్లయిపోయి వుంది.

కటారి, రక్తం వోడుకుంటూ రాచబిడ్డ చేతిలోనేవుంది; కాని తుపాకి తురకయోధుకి గజందూరంగా పడివుంది.

దర్బారు తనకళ్లనే నమ్మలేకపోయింది.

తండ్రీ, మీసంమీద చెయ్యి వేసుకోడం చూసి వొక్కమాటు చిరునవ్వు నవ్వుకుని రాచబిడ్డా, నవాబు తబ్బిదిగి

బయులుదేరడం చూసి వొక్కమాటు మందహాసం చేసుకుని తురకబిడ్డా మెడలు వేలవేసేశారు.

ఏకకాలంలో, వున్న యిద్దరు కొడుకులనూ కోల్పోయిన మొనగాడు, ఆనందతరంగితా లయిన కళ్ళతో దర్బారు కలయు చూసి, ముద్దుపెట్టుకోదలచిన నవాబుకి దర్జాగా చెయ్యి అందించాడు.

*　*　*　*　*　*

నవాబు మొదలు పారాజవానుదాకా అక్కడ వున్న వా రందరూ పడివున్న తురకబిడ్డనీ, రాచబిడ్డలనూ సలాములు చేసి గౌరవించారు.

నవాబు, తన లీలోద్యానంలో నదరైన స్థలా లిచ్చి,— తురకయోధుని పూడ్పించి అక్కడ చక్కని మహలు కట్టించాడు.

రాచకుమాళ్ళను దహనసంస్కారం చేయించి ఆ స్థలంలో తులసీబృందావనం వేయించాడు.

తరవాత, అతను, క్షత్రియులకు సైన్యాధిపత్యా లిచ్చాడు. జాగీర్లిచ్చాడు. దర్బారులో యెగువపీట లిచ్చాడు. కనకాభిషేకాలు చేశాడు.

క్షత్రియులు, నవాబుని దేవుణ్ణి కొలిచినట్లు కొలిచారు.

అతని రాజ్యమూ, వైభవమూ, ప్రతిష్ఠా ద్విగుణితం చేశారు.

కొంతకాలానికి మొనగాడు కాలంచేశాడు.

అతని భార్య సహగమనం చేసింది.

అతనివంశం అంతటితో సరి.

పోగా మిగిలివున్న నాలుగుగోత్రాల క్షత్రియులే ఆంధ్ర దేశంలో స్థిరపడి వంశాభివృద్ధి పడశారు.

అంచేత ఆంధ్ర క్షత్రియులలో యిప్పుడు నాలుగు గోత్రాల వారే వున్నారు.

జూన్ ౧౯-౨౯

(భారతినుంచి సవరణలతో)